సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 28 । మార్చి । 2025



కల్లలైన కలలు

పిల్లల కోసం కలలు కన్న ఒక నిరుపేద దంపతులకు ఫెర్టిలిటీ సెంటర్ తీరని దుఃఖాన్ని మిగిల్చింది. II లో

ఉష్ణోగ్రతలు

అనకాపల్లి
గురువారం

గరిష్ట	కనిష్ట
37.2 డిగ్రీలు	24.2 డిగ్రీలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర	సహర్ శని
అనకాపల్లి	6.14	4.39
నర్సీపట్నం	6.17	4.37

న్యూస్‌రీల్

31 తేదీ వరకు ఇ-శ్రమ్ నమోదుకు గడువు

తుమ్మపాల : ప్రమాదవశాత్తూ మరణించిన, పాక్షిక, శాశ్వత అంగవైకల్యం పొందిన అసంఘటిత రంగ కార్మికుల ఆర్థిక సహాయం కోసం ఈ నెల 31 లోగా ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ ఇంచార్జి కమిషనర్ కె. వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022 మార్చి 31కి ముందు మరణించిన, గాయపడిన కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందించే సహయం కోసం దరఖాస్తు గడువు పొడిగించినట్టు పేర్కొన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేటప్పుడు కార్మికుడి ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధానమైన మొబైల్ నెంబర్, కార్మికుని సేవింగ్స్ బ్యాంకు అకౌంట్ నెంబర్, ఐఎఫ్‌ఎస్సీ కోడ్, బ్రాంచ్ వివరాలు అవసరమన్నారు. కార్మికులు స్వయంగా https://register.eshram.gov.in లింక్‌లో నేరుగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

మెప్మా సిబ్బంది గిన్నిస్ రికార్డులు



గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్లను అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : పురపాలక పరిధిలో మెప్మా సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా మార్చి 8వ తేదీ నాటికి కొనుగోలు లక్ష దాటిన సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్లు వరించాయి. గురువారం క్యాంపు కార్యాలయంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు మెప్మా సిబ్బందిని అభినందించారు. ప్రతి మహిళను వ్యాపారవేత్తగా తయారు చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి సభ్యురాలు వినియోగించుకోవాలన్నారు. మెప్మా సిబ్బంది ప్రతి వార్డులో సభ్యులకు అవగాహన కల్పించి, ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఉత్పత్తులను మార్కెట్ చేసి, ఉపాధి అవకాశాలను పెంపొందించాలన్నారు.

స్థానిక ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి



రాజారామ్
ఎంపీపీ, మాడుగుల



వెంకటలక్ష్మి
ఎంపీపీ, ఎస్.రాయవరం



సర్వేశ్వరరావు
ఎంపీపీ, మాకవరపాలెం



చింతల బుల్లిలక్ష్మి
ఎంపీపీ, దేవరాపల్లి

- జిల్లాలో 4 ఎంపీపీ, 2 వైస్ ఎంపీపీ ఎన్నికలు
- 4 ఎంపీపీ స్థానాలూ ఏకగ్రీవం, ఒక వైస్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీ కైవసం
- సబ్బవరంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీల గైర్హాజరుతో వైస్‌ఎంపీపీగా స్వతంత్ర అభ్యర్థి విజయం
- కూటమి నేతల ప్రలోభాలకు చెక్ చెప్పిన వైఎస్సార్‌సీపీ సభ్యులు

సాక్షి, అనకాపల్లి :

జిల్లాలో జరిగిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఉప ఎన్నికల్లో ఫ్యాన్ జోరు పెంచింది. జిల్లాలో జరిగిన 4 ఎంపీపీ, 2 వైస్ ఎంపీపీ స్థానాలకు గానూ 4 ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ స్థానాలను వైఎస్ఆర్‌సీపీనే కైవసం చేసుకుని విజయదుందుభి మోగించింది. మరో వైస్ ఎంపీపీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ గైర్హాజరు కావడంతో స్వతంత్ర అభ్యర్థి ఎన్నికయ్యారు. కూటమి నేతలు అధికార బలంతో బెదిరింపులు, ప్రలోభాలకు తెరదీసినా వైఎస్సార్‌సీపీలోనే ఉంటాం..వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామంటూ గెలిపించి చూపించారు. బలం లేకపోయినా గెలవాలన్న కూటమి నేతల కుట్రలకు చెక్ పెట్టారు. అనకాపల్లి జిల్లాలో ఎస్.రాయవరం, దేవరాపల్లి, మాకవరపాలెం, మాడుగుల ఎంపీపీలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాకవరపాలెంలో ఎంపీపీ ఎన్నిక షెడ్యూల్ ప్రకటించిన మరుక్షణం నుంచి కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు ఫోన్‌లు చేసి బెదిరింపులకు పాల్పడడం, ప్రలోభాలకు గురి చేయడం చేశారు. కానీ కూటమి నాయకులు ఇచ్చే తాయిలాలను తిరస్కరించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- జిల్లాలో ఎస్.రాయవరం, దేవరాపల్లి, మాకవరపాలెం, మాడుగుల ఎంపీపీలకు ఉప ఎన్నికలు జరిగాయి. మాకవరపాలెం ఎంపీపీ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసే కుటిల ప్రయత్నాలకు కూటమి నాయకులు పాల్పడినా వె.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో ఎంపీటీసీలందరూ ఏకతాటిపై నిలిచి వైఎస్సార్‌సీపీ వెంటే ఉండి ఎంపీపీని గెలిపించారు. మాకవరపాలెం ఎంపీపీ-రుత్తల సర్వేశ్వరరావు(వైఎస్సార్‌సీపీ), ఎస్.రాయవరం ఎంపీపీ-కేసుబోయిన వెంకటలక్ష్మి (వైఎస్సార్‌సీపీ), దేవరాపల్లి ఎంపీపీ-చింతల బుల్లిలక్ష్మి (వైఎస్సార్‌సీపీ) గెలిచారు. చోడవరం వైస్ ఎంపీపీగా శరగడం లక్ష్మి(వైఎస్సార్‌సీపీ), సబ్బవరం వైస్ ఎంపీపీ-మామిడి లక్ష్మి(ఇండిపెండెంట్) గెలుపొందారు.
- పెందుర్తిలో కోఆప్టెడ్ మెంబర్‌గా ముదపాక శివ ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ప్రతిపాదించగా ఎంపీపీ మద్దతు పలికారు.
- అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వైస్ ఎంపీపీగా గెలిచిన మామిడి లక్ష్మి గతంలో వైఎస్సార్‌సీపీలోనే ఎంపీటీసీగా గెలిచారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. మొత్తం 19 మంది సభ్యులకు వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో మిగిలిన 11 మంది ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఆమెను ఎన్నుకున్నారు.

వెదురువాడలో ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

- అచ్యుతాపురం మండలంలో వెదురువాడ పంచాయతీలో ఉపసర్పంచ్ ఉప ఎన్నికలో కూటమి బలం లేకపోవడంతో ప్రలోభాలకు గురిచేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ససేమిరా అనడంతో వాయిదా వేశారు. మాడుగుల మండలంలో కింతలి గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక శుక్రవారం నాటికి వాయిదా పడింది. అయితే ఇక్కడ ఉప సర్పంచ్‌గా పల్లా పెద్దమ్మాలు గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేశారు.
- మునగపాక మండలంలో ఐదు పంచాయతీలకు గురువారం ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా వాటిలో మునగపాక తప్ప ఇతర పంచాయతీలకు ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. మునగపాక ఉప సర్పంచ్‌కు సంబంధించి సభ్యులు ఎవరూ ఎన్నికకు హాజరుకాకపోవడంతో ఎన్నికల అధికారి సోమరాజు శుక్రవారం నాటికి వాయిదా వేశారు. నారాయుడుపాలెం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఉప సర్పంచ్‌గా కొయ్య నల్లయ్య, రాజుపేట కూటమి ఉప సర్పంచ్‌గా జెర్రిపోతుల కనక మహాలక్ష్మి, ఒప్పందం ప్రకారం పార్టీలకతీతంగా తోటాడ ఉప సర్పంచ్‌గా కోట్ల హేమ, నాగులాపల్లి ఉప సర్పంచ్‌గా గోసాల గోవిందరాజులు ఇరు పార్టీల వారు ఎన్నుకున్నారు.



మాడుగుల : ఎంపీపీగా ఎన్నికైన రాజారామ్‌ను సత్కరిస్తున్న ఎంపీటీసీ సభ్యులు



ఎస్.రాయవరం : ఎంపీపీగా ఎన్నికైన వెంకటలక్ష్మిని అభినందిస్తున్న బొలిశెట్టి గోవిందరావు



దేవరాపల్లి ఎంపీపీగా ఎన్నికైన బుల్లిలక్ష్మిని సత్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మాకవరపాలెం : కొత్త ఎంపీపీ సర్వేశ్వరరావును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

విజేతలు వీరే..

మండలం	ఎంపీపీ	పార్టీ	సామాజికవర్గం
మాకవరపాలెం	రుత్తల సర్వేశ్వరరావు	వైఎస్సార్‌సీపీ	వెలమ
ఎస్.రాయవరం	కేసుబోయిన వెంకటలక్ష్మి	వైఎస్సార్‌సీపీ	శెట్టిబలిజ
దేవరాపల్లి	చింతల బుల్లిలక్ష్మి	వైఎస్సార్‌సీపీ	వెలమ
వి.మాడుగుల	తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్	వైఎస్సార్‌సీపీ	బీసీ

వైస్ ఎంపీపీలు వీరే ..

మండలం	వైస్ ఎంపీపీ	పార్టీ	సామాజికవర్గం
చోడవరం	శరగడం లక్ష్మి	వైఎస్సార్‌సీపీ	గవర
సబ్బవరం	మామిడి లక్ష్మి	ఇండిపెండెంట్	తూర్పు కాపు

యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు

- నిర్దేశిత ఫార్మాట్‌లో మరోసారి నోటీసు అందజేసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు



అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నోటీసు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు

యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై అవిశ్వాసం కోరుతూ వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు గురువారం మరోసారి అనకాపల్లి జిల్లా కలెక్టరు, ఆర్డీవో, యలమంచిలి మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులకు నోటీసు అందజేశారు. వాస్తవానికి బుధవారమే నోటీసు అందజేసినప్పటికీ నిర్దేశిత ఫార్మాట్‌లో నోటీసు ఇవ్వాల్సి ఉండడంతో పురపాలక ఎన్నికల నియమావళిని అనుసరించి ఫాం-1 పూర్తి చేసి దానిపై 18 మంది వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు సంతకాలు చేసిన నోటీసు కాపీలను మరోసారి అధికారులకు అందజేశారు. యలమంచిలి మున్సిపాలిటీలో 25 వార్డులుండగా 23 వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు గెలుపొందారు. మున్సిపాలిటీలో 5వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యురాలిగా ఎన్నికైన పిళ్లా రమాకుమారిని 2021 మార్చిలో పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారకాంక్షతో పిళ్లా రమాకుమారి బీజేపీలో చేరారు. నాలుగేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుతో చైర్‌పర్సన్‌గా ఎన్నికైన రమాకుమారి పార్టీ మారడంతో అవిశ్వాసం కోరుతూ మెజార్టీ కౌన్సిలర్లు కలెక్టరుకు నోటీసు అందజేశారు. ప్రత్యేకంగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని నోటీసులో కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇవ్వడంతో యలమంచిలి పట్టణంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అవిశ్వాస నోటీసు అధికారులకు అందజేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వర్రావు, అర్రెపు గుప్తా, దూది నర్సింహమూర్తి, పిళ్లా త్రినాథరావు, కొఠారు కొండబాబు, పలువురు వార్డు కౌన్సిలర్లు ఉన్నారు.

జల ఘంటికలు..

- జిల్లాలో వేసవి ఆరంభంలోనే నీటి ఎద్దడి
- చెరువులు, బావుల్లో అడుగంటిన నీటి వనరులు
- గిరిజన గ్రామాల్లో దూరం నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి
- నిర్వహణ లోపంతో అధ్వానంగా మారిన నీటి పథకాలు
- ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కష్టాలు తీరేదెలా అంటూ ప్రజల ఆవేదన

వేసవి ఆరంభంలోనే నీటి ఎద్దడి ప్రారంభమయింది. బోర్లు, నదులు, బావులు, చెరువుల్లో నీటి వనరులు అడుగంటాయి. నిర్వహణ లోపంతో మంచినీటి పథకాలు మూలకు చేరాయి. కూటమి సర్కారు నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయలేదు. జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో పరిస్థితి మరీ దారుణం. మూడు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళితే గానీ నీటి జాడ ఉండడం లేదు. చలమల్లో పట్టి నీరు తెచ్చుకుంటున్నారు. మార్చి నెలలోనే ఇలా ఉంటే రానున్న మూడు నెలలు గడిచేది ఎలా అని ప్రజలు ఆందోళన పడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే అధికార యంత్రాంగం తగిన యాక్షన్ ప్లాన్‌తో వెళుతున్నట్టు కనిపించడం లేదు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులపై 'సాక్షి' ఫోకస్ ఇది..





రోలుగుంట మండలం అర్ల పంచాయతీ పెదగరువు గ్రామంలో కలెక్టర్ విజయకృష్ణన్ పర్యటించినపుడు తాగునీటి సదుపాయం కోసం ఖాళీ బిందెలతో వేడుకుంటున్న గిరి మహిళలు



చీడికాడ : బోరు నుంచి వస్తున్న ఎర్ర రంగులో మారిన నీరు



దేవరాపల్లి మండలం బోడిగరువులో కుళాయికి గుడ్డలు కట్టి నీరు పట్టుకుంటున్న దృశ్యం

జిల్లాలో వివరాలు ఇలా..

జిల్లాలో గ్రామ పంచాయతీలు	572
మొత్తం జనాభా	15,33,520
చేతిపంపులు	16,059
పీడబ్ల్యూఎస్ స్కీంలు	1850
సీడబ్ల్యూఎస్ స్కీంలు	28
జిల్లాలో కుళాయి కనెక్షన్లు	2.64 లక్షలు

సాక్షి, అనకాపల్లి :

ఏజెన్సీని అనుకుని ఉన్న మండలాల్లో శివారు గిరిజన గ్రామాల్లో బిందెడు నీటి కోసం గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. తాగునీటి కోసం సుమారు మూడు నాలుగు కిలోమీటర్ల మేర మండుటెండలో నడుచుకుంటూ వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. దాహార్తిని తీర్చండి సారూ... అంటూ ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల పరిధిలో ఉన్న శివారు గిరిజన గ్రామాల్లో తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అయితే సమీప గ్రామాల గిరిజనులంతా వారే సొంతంగా బావులు తవ్వుకున్నారు. వేసవి కావడంతో వాటిలో కూడా నీళ్లు అడుగంటుతున్నాయి. మరికొన్ని గిరిజన గ్రామాల్లో బురద నీటిని గత్యంతరం లేని పరిస్థితుల్లో వడ కట్టుకుని తాగుతున్నారు. విసిగిపోయిన గిరిజన మహిళలు అడపాదడపా బిందెలతో నిరసన తెలియజేస్తున్నారు. ఇక జిల్లాలోని మైదాన మండలాల్లో రక్షిత తాగునీటి పథకాలు పడకేశాయి. జల్‌జీవన్‌మిషన్ పనులు అసంపూర్తిగా ఉండి ఇంటింటి కుళాయి కనెక్షన్లలో జాప్యం జరుగుతోంది.

గిరిజన గ్రామాల్లో గొంతెండుతోంది...



రోలుగుంట మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో చెలమల్లో నీరు పట్టుకుంటున్న గిరి మహిళలు

రోలుగుంట మండలంలో 3 వేలకు పైగా గిరిజనులు నివసిస్తుంటారు. అర్ల, పీతిరిగడ్డ, లూసింగి, పెదలూసింగి, కొరుప్రోలు గ్రామాలవారు సొంతంగా బావి తవ్వుకొని అక్కడి నుంచి నీరు తెచ్చుకొని తాగుతారు. వేసవి వచ్చిందంటే ఆ బావి అడుగంటి బురద నీళ్లుగా తయారవుతాయి. దీంతో తాగడానికి నీరు లేక సమీపంలో 3 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉండే గెడ్డలు, వాగుల్లోకి వెళ్లి బిందెలతో తెచ్చుకుంటారు. గతంలో కలెక్టర్ విజయ కృష్ణన్ పర్యటించినప్పుడు బిందెలతో గిరిజన మహిళలు నిరసన కూడా తెలియజేశారు. గొలుగొండ మండలంలోని అన్ని గిరిజన గ్రామాల్లో నీటి సమస్య ఉంది. నాతవరం మండలంలో 30కి పైగా గిరిజన గ్రామాలున్నాయి. సుందరకోట, రత్నగిరి, బమ్మిళ్లోద్దు, ముత్తమామిళ్లోద్దు, కొత్తోద్దులు, తోరడ, పాత సిరిపురం, కొత్త సిరిపురం గ్రామాలు కొండపై ఉండడంతో వేసవిలో అక్కడి బావుల్లో నీరు తగ్గిపోతుంది. ప్రత్యామ్నాయంగా వేసిన బోర్లు కూడా అడుగంటిపోతాయి. ఇలాంటి సందర్భంలో అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాల్సి ఉంటుంది. కానీ అలాంటి ప్రయత్నమేదీ జరగడం లేదు. మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల పరిధిలో 55 గిరిజన గ్రామాలు ఉన్నాయి. మాడుగుల మండలంలో వాపర్తి, రాజంపేట గ్రామాల్లో 150 మంది గిరిజనులు నివాసం ఉంటారు. చీడికాడ మండలంలోని కోనాం శివారు బందవీధి గిరిజన గ్రామంలో గిరిజనులు తాగునీటి కోసం చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. దేవరాపల్లి మండలంలో వాలాబు పంచాయతీ శివారు కె.తుమ్మలపాలెం, కొత్తూరు, ఇప్పగరువు గ్రామాల్లో పలుచోట్ల పైపులైన్లు దెబ్బతిన్న కారణంగా తాగునీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బోరు నుంచి వచ్చే నీరు రంగు మారుతుంది..

చీడికాడ మండలంలోని కోనాం శివారు బందవీధి గ్రామంలో నివసిస్తున్నాం. తాగునీటి బోరు నుంచి బురద నీరు వస్తోంది. ఈ గ్రామంలో 10 కుటుంబాలకు ఈ బోరే గతి. నీరు తొడిన కొద్దీ ఎర్ర రంగులో మారి కిలుం వాసన వస్తుంది. ఈ నీటితో అన్నం వండితే గెంజి ఎర్రగా మారుతుంది. తాగితే అనారోగ్య బారిన పడుతున్నాం.

– కొర్రా మోహన్, చీడికాడ

మైదానంలో తాగునీటి పథకాలు అసంపూర్ణం

- పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.35 కోట్లతో మెగా ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. ఏలేరు కాలువ నుంచి నీటిని తీసుకొచ్చి 140 గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే దిశగా పనులు మొదలు పెట్టారు. అనంతరం ఆ ప్రాజెక్టు మూలకు చేరింది.
- కె.కోటపాడు మండలం ఆనందపురం గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలతో 40 వేల లీటర్ల మంచినీటి పథకానికి అనుమతులు మంజూరయ్యాయి. నిర్మాణం ప్రారంభించిన తరువాత.. కూటమి పార్టీల నేతలు శ్మశానవాటికలో ట్యాంక్ నిర్మాణాన్ని చేపడుతున్నట్టు కోర్టును ఆశ్రయించి పనులు జరగకుండా అడ్డుపడ్డారు.
- నాతవరం మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 457 చేతిబోర్లు, 120 తాగునీటి పథకాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం జిల్లేడుపూడి పంచాయతీలో రూ.26 లక్షలు, మర్రిపాలెం పంచాయతీలో రూ.46 లక్షలు మంజూరు చేశారు. ఆ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. ఇంటింటా కుళాయిల కనెక్షన్‌లు ఇవ్వడంలో జాప్యం నెలకొంది.
- బుచ్చెయ్యపేట మండలంలో 68 మంచి నీటి పనులు, 26 ట్యాంకులు మంజూరు కాగా.. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలైనా సగం పనులు కూడా పూర్తి కాలేదు. పోలేపల్లి గ్రామంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకు పూర్తిగా శిథిలమైంది. కేపీ అగ్రహారంలో భూగర్భ జలాలు అడుగంటడంతో రామాలయం, సుంకరి వీధి, జొన్నపల్లి వీధి, శెట్టివారి కల్లాల వద్ద మంచినీటి బోర్లకు నీరందడం లేదు.



మోటారు, కరెంట్ ఏర్పాటు చేయక నిరుపయోగంగా ఉన్న బుచ్చెయ్యపేట మండలం పోలేపల్లిలోని మంచినీటి ట్యాంకు



కె.కోటపాడు మండలం ఆనందపురంలో అసంపూర్తిగా ట్యాంక్ నిర్మాణం

ఎప్పుడు బాగు చేస్తారో...



నెలల తరబడి మంచి నీటి కుళాయిలు రావడం లేదు. పలుమార్లు పంచాయతీ వారిని అడిగితే పైప్‌లైన్ రిపేర్ చేయాల్సి ఉందన్నారు. రోడ్ల విస్తరణ పనులు పూర్తయ్యాక పైప్‌లైన్ పనులు చేపడతామన్నారు. వేసవి కావడంతో మంచి నీటికి చాలా ఇబ్బంది పడుతున్నాము. అధికారులు త్వరితగతిన మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలి.

–వరలక్ష్మి, అచ్యుతాపురం

అధికారులకు పట్టడం లేదు



రోలుగుంట మండలం అర్ల గిరిజన పంచాయతీ శివారు పెదగరువు గ్రామం ఉంది. ఇక్కడ 50 మంది జనాభా ఉన్నారు. తాగునీటి వనరులు లేవు. మంచినీళ్లు తెచ్చుకోవాలంటే రెండు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుంది. పాలకులు తాగునీటి సమస్య తీరుస్తాం అంటున్నారే కానీ తీరలేదు. జెడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలు మంజూరు అయ్యాయి..త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెబుతున్నారు.

–సింధరి నాగేష్, పెదగరువు, అర్ల పంచాయతీ, రోలుగుంట మండలం

ముందస్తు చర్యలు చేపడుతున్నాం..

వేసవి నేపథ్యంలో జిల్లాలో నీటి ఎద్దడి ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చేతి బోర్లు, పంప్‌సెట్లు, పైపులైన్లు ఒకటికి రెండుసార్లు సరి చేస్తున్నాం. వేసవి నేపథ్యంలో ఎక్కడ సమస్య ఏర్పడినా వెంటనే పరిష్కరించేందుకు వీలుగా సిబ్బందిని నియమించాం. ప్రస్తుతం చేతిబోర్లన్నీ కండీషన్‌లోనే ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న కొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో తాగునీటి ఇబ్బందులంటూ లేవు. భూగర్భ జలాలు ఎండల తీవ్రతకు తగ్గుముఖం పట్టడం మామూలే.

– రామస్వామి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి


నూతన ఎంపిపి రాజారామ్ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రిసైడింగ్ అధికారి వీరంనాయుడు, ఎంపిడిఓ అప్పారావు


ఎంపీపీ బుల్లిలక్ష్మిని అభినందిస్తున్న దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎస్.రాయవరం ఎంపీపీగా ఎన్నికైన వెంకటలక్ష్మిని అభినందిస్తున్న నాయకులు


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సర్వేశ్వరరావు

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


పప్పల శంకరరావుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి : విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ కారణాలతో మృతిచెందిన హోంగార్డుల కుటుంబానికి ఒక రోజు హోంగార్డుల జీతాన్ని అందజేయడం అభినందనీయమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తమ కార్యాలయంలో గురువారం జిల్లాకు చెందిన హోంగార్డు పప్పుల లక్ష్మి, విశాఖ కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో ఆమె భర్త పప్పుల శంకరరావుకు రూ.4,17,565 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు విధి నిర్వహణలో మృతి చెందిన లేదా పదవీ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులంతా తమ ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఏవో ఏ.రామ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : షెడ్యూల్ కులాలకు చెందిన మహిళలకు టైలరింగ్ కోర్సులో స్వల్ప కాలిక నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ జిల్లా సహాయ సంచాలకుడు ఎస్.వి.ఎస్.ఎస్. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మాకవరపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) శిక్షణ కేంద్రంలో రాష్ట్ర నైపుణ్యాభివృధి సంస్థ ఆధ్వర్యంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తారన్నారు. కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 44 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో శిక్షణ ప్రారంభిస్తామన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత రంగంలో ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ఎంపీపీ ఉప ఎన్నికలు ఏకగ్రీవం

- దేవరాపల్లి ఎంపీపీగా చింతల బుల్లిలక్ష్మి ఏకగ్రీవం
- ఎస్.రాయవరం ఎంపీపీగా వెంకటలక్ష్మి విజయకేతనం
- మాడుగుల ఎంపీపీగా వెంకట రాజారామ్ గెలుపు
- మాకవరపాలెంలో సర్వేశ్వరరావు హవా
- చోడవరంలో సత్తా చాటిన శరగడం లక్ష్మి

దేవరాపల్లి:

దేవరాపల్లి ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చింతల బుల్లిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎస్.మంజులవాణి సమక్షంలో ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 17 ఎంపీటీసీలకు గాను 12 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. ముందుగా ఎంపీపీ అభ్యర్థిగా బుల్లిలక్ష్మిని ఎంపీటీసీ రొంగలి నారాయణమ్మ ప్రతిపాదించగా, ఎంపీటీసీ పంచాడ సింహాచలం నాయుడు బలపరిచారు. ఎన్నికల అధికారి సమక్షంలో 12 మంది ఎంపీటీసీలు చేతులెత్తి చింతల బుల్లిలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి మంజులవాణి ఎంపీపీగా బుల్లిలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ధ్రువీకరించి, వెంటనే ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు విప్ జారీ చేశారు. ఈ ఎన్నిక ప్రక్రియలో ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు, పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, ఎంపీటీసీలు పోతల వెంకటరావు, పంచాడ సింహాచలం నాయుడు, కోలా వెంకటరమణ, రొంగలి నారాయణమ్మ, వంటాకు పైడితల్లమ్మ, బొడ్డు లక్ష్మి, రుత్తల లక్ష్మి, బండి గౌరమ్మ, మజ్జి దేవి, పాటేల ఈశ్వరమ్మ, కోఆప్షన్ మెంబర్ దండే జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీపీగా ఏకగ్రీవంగా గెలుపొందిన బుల్లిలక్ష్మితో పాటు పార్టీ ఆదేశాలను శిరసా వహించి ఎంపీపీని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బుల్లిలక్ష్మి మాట్లాడుతూ తనకు ఎంపీపీగా అవకాశం కల్పించిన మాజీ డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడుకు, గెలిపించిన ఎంపీటీసీ సభ్యులకు, తన గెలుపునకు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీని జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, సర్పంచ్‌లు నాగిరెడ్డి శరాకినాయుడు, గూడెపు రాము, రొంగలి వెంకటరావు, దాసరి సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఎస్.రాయవరం ఎంపీపీగా వెంకటలక్ష్మి..

ఎస్.రాయవరం: మండల పరిషత్ అధ్యక్షురాలిగా కొరుప్రోలు ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మిని ఎంపీటీసీ సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎన్నికల అధికారి కె.మనోరమ ఎంపీటీసీ సభ్యులతో ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన అభ్యర్థి కేసుబోయిన వెంకటలక్ష్మిని, వైస్ ఎంపీపీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు ప్రతిపాదించగా, బాలం సూరిబాబు బలపరచారు. పోటీలో ప్రత్యర్థులు లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ప్రకటించారు. ఎన్నిక సమయంలో టీడీపీ ఎంపీటీసీ కొక్కులూరి మంగ హాజరు కావడం విశేషంగా మారింది. మిగిలిన ముగ్గురు టీడీపీ, ఒక జనసేనా ఎంపీటీసీ హాజరు కాలేదు. తోటి ఎంపీటీసీలు బాలం సూరిబాబు, శానాపతి రాము, బైపా శ్రీనివాసరావు, బొంగా వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మరో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, పార్టీ నాయకులు చేకూరి శ్రీరామచంద్రరావు, పార్టీ జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, శానాపతి శ్రీరాములు, ఐవీ రత్నం, వెదుళ్ల బంగారి, కర్రి శ్రీను ఎంపీపీని అభినందించారు.

మాడుగుల ఎంపీపీగా వెంకట రాజారామ్ ఎన్నిక..

మాడుగుల: మాడుగుల మండల పరిషత్ నూతన ఎంపీపీగా తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కె.వీరంనాయుడు, ఎంపీడీవో కె. అప్పారావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 19 మంది హాజరు కాగా, ఎంపీపీ పదవికి తాళ్లపురెడ్డి రాజారామ్‌ను వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ (పెదబాబు) ప్రతిపాదించారు. మాడుగుల ఎంపీటీసీ సభ్యురాలు–1 పాలిమేర విజయలక్ష్మి (వైఎస్సార్‌సీపీ) బలపరిచారు. మిగిలిన సభ్యులు చేతులెత్తి రాజారామ్‌కు మద్దతు పలికారు. దీంతో ఎంపీపీగా వెంకట రాజారామ్ ఎన్నుకైనట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వీరంనాయుడు ప్రకటించారు. అనంతరం ఎంపీపీగా రాజారామ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నికకు కె.జె.పురం ఎంపీటీసీ–1 చిన్నం లోవతల్లి (దేశం), పొంగలిపాక ఎంపీటీసీ సభ్యులు మైచర్ల సన్యాసిరావు (స్వతంత్ర) హాజరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఆర్లె మాధవి, కుక్కర మహేశ్వరి, కొత్తపల్లి శ్రీనివాస్ (వైస్ ఎంపీపీ), కోట్ని సూర్యకుమారి, చదల కష్టందొర, తలారి అప్పారావు, తుర్రే సత్యవతి, దాడి నూకరత్నం, దండి నాగరత్నం, పాలిమేర విజయలక్ష్మి, బగుడు వరహాలమ్మా, ముమ్మిన రమణబాబు, వేమవరపు రామధర్మజ, గుడెపు సత్యవతి, సాగాని కొండమ్మా, శ్రీనాథు సూర్యకాంతం, ఆర్. సంతోషి, స్థానిక మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ ఆహ్మద్ ఉన్నీసా హాజరయ్యారు.

ఎంపీపీగా సర్వేశ్వరరావు ఏకగ్రీవం..

మాకవరపాలెం: ఎంపీపీగా రుత్తల సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీపీ సత్యనారాయణ రాజీనామా చేయడంతో ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌తో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి రామ్మోహన్‌రావు ఎన్నిక నిర్వహించారు. టీడీపీ నుంచి ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాలేదు. తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు సర్వేశ్వరరావుకు మద్దతుగా నిలివడంతో ఏకగ్రీమవంగా ఎంపీపీగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి నుంచి సర్వేశ్వరరావు ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. సర్వేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ అభినందించారు. మరలా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా పని చేయాలన్నారు.

మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సీనియర్ నేత యర్రాపాత్రుడు, వైస్ ఎంపీపీలు లక్ష్మి, రాజారావు, పార్టీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, సర్పంచ్‌ల సంఘ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు గోవిందరావు, మాజీ పార్టీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీగా శరగడం లక్ష్మి ఏకగ్రీవం..

చోడవరం: మండల పరిషత్ వైస్ ఎంపీపీగా వైఎస్సార్‌సీపీ నుంచి శరగడం లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చోడవరం మండల పరిషత్ వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. మండల పరిషత్‌లో 25 ఎంపీటీసీ స్థానాలకు గాను 20 ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి ఉన్నాయి. ముందస్తు ఒప్పందం మేరకు ఇప్పటి వరకూ గజపతినగరం ఎంపీటీసీ గంగరాజు వ్యవహరిస్తూ ఇటీవల రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఎన్నిక జరిగింది. మెజార్టీ ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకే ఉంటంతో గురువారం జరిగిన ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి లక్ష్మి ఎన్నికయ్యారు.


చోడవరం వైస్ ఎంపీపీగా ఎన్నికైన శరగడం లక్ష్మిని అభినందిస్తున్న నాయకులు

అయితే టీడీపీ సభ్యులు ఐదుగురు ఉన్నప్పటికీ వారు ఎన్నికకు దూరంగా ఉండగా వైఎస్సార్‌సీపీ నుంచి ఇద్దరు సభ్యులు వివిధ కారణాల రీత్యా హాజరు కాలేదు. వైఎస్సార్‌సీపీకి చెందిన 18 మంది సభ్యులు హాజరు కాగా వీరిలో అంబేరుపురం ఎంపీటీసీ శరగడం లక్ష్మిని వైస్ ఎంపీపీగా బెన్నవోలు ఎంపీటీసీ కంచిపాటి దేవ ప్రతిపాదించగా భోగాపురం ఎంపీటీసీ ఆడారి కోటిభూలోక బలపరిచారు. పోటీలో ప్రతిపక్షం నుంచి ఎవరూ లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ఎన్నికల అధికారి, ఎంపీడీవో ఆంజనేయులు ప్రకటించారు. ఎంపీపీ గాడి కాసు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, రైతు అధ్యక్షుడు బొడ్డేడ సూర్యానారాయణ, నియోజకవర్గం ఉపాధ్యక్షుడు శరగడం చిమ్మినాయుడు, వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ కాండ్రేగుల డేవిడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం వైస్ ఎంపీపీ–2గా మామిడి లక్ష్మి

సబ్బవరం: సబ్బవరం వైస్ ఎంపీపీ–2గా మామిడి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో గురువారం నిర్వహించిన ఎన్నికలో 11 మంది సభ్యులు పాల్గొని, చేతులెత్తే విధానంలో వైస్ ఎంపీపీని ఎన్నుకున్నారు.

పెందుర్తి కోఆప్షన్ సభ్యుడిగా శివ

పెందుర్తి: స్థానిక మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ముదపాకకు చెందిన ముదపాక శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన రాజయ్యపేట వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు ముదపాక దేవి కుమారుడు. ఇక్కడ వేరెవరూ పోటీకి దిగకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

కల్లలైన కలలు

- పిల్లల కోసం ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆశ్రయించిన దంపతులు
- 8వ నెలలో కవలలతో సహా తల్లి మృతి
- ముగ్గురి ప్రాణం విలువ రూ.4 లక్షలు కట్టిన ఆస్పత్రి యాజమాన్యం

డాబాగార్డెన్స్: పిల్లల కోసం కలలు కన్న ఒక నిరుపేద దంపతులకు ఫెర్టిలిటీ సెంటర్ తీరని దుఃఖాన్ని మిగిల్చింది. ఇందుకోసం తొమ్మిది లక్షల రూపాయలు ఖర్చు చేసినా ఫలితం లేకపోగా.. కడుపులో పెరుగుతున్న కవలలతో సహా తల్లి కూడా మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఆ ముగ్గురు ప్రాణం విలువను రూ.4 లక్షలుగా వెలకట్టి ఆస్పత్రి యాజమాన్యం చేతులు దులుపుకుంది. బాధితుడు తెలిపిన వివరాలివి..

అనకాపల్లి జిల్లా మాకవరపాలెం ఎస్సీ కాలనీకి చెందిన గెంజి వరహాలు బాబు ఓ కంపెనీలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎనిమిదేళ్ల కిందట లక్ష్మితో అతనికి వివాహం జరిగింది. పిల్లలు లేకపోవడంతో బాధపడుతున్న వరహాలు బాబుకు.. అదే కంపెనీలోని ఒక సహోద్యోగి రామ్‌నగర్‌లోని ఆరాధ్య ఆస్పత్రి గురించి చెప్పాడు. అక్కడ చికిత్స తీసుకుంటే పిల్లలు పుడతారని


లక్ష్మి(ఫైల్)


చెప్పడంతో.. వరహాలు బాబు, లక్ష్మి దంపతులు ఎనిమిది నెలల కిందట ఆరాధ్య ఆస్పత్రిని సంప్రదించారు. ప్రారంభంలో ఆస్పత్రి యాజమాన్యం రూ.2,25,000 ఖర్చు అవుతుందని చెప్పగా.. తమ ఆర్థిక పరిస్థితిని వివరించడంతో రూ.2,10,000కు అంగీకరించారు. లక్ష్మికి రూ.12 రోజుల పాటు రోజుకు ఒక ఇంజక్షన్ చొప్పున 12 ఇంజక్షన్లు వేశారు. ప్రయాణాలు, వైద్య ఖర్చులు, మందులు, స్కానింగ్‌ల కోసం నెలకు దాదాపు రూ.20 వేల వరకు ఖర్చు చేసేవారు. నాలుగో నెలలో లక్ష్మి గర్భంలో ముగ్గురు పిల్లలు ఉన్నారని వైద్యులు చెప్పడంతో సంతోషించిన ఆ దంపతులు.. ఇద్దరు పిల్లలు చాలని కోరారు. దీంతో వైద్యులు ఒక పిండాన్ని తొలగించారు. ఆ తర్వాత ఆరు నెలల వరకు తల్లి, పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నారు. 7వ నెలలో నిర్వహించిన పరీక్షల్లో లక్ష్మికి మధుమేహం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనల మేరకు ఆహార నియమాలు పాటించినప్పటికీ.. సరైన పోషకాహారం లేక పిల్లల ఎదుగుదల సరిగా లేకపోయింది. దీంతో ఆస్పత్రి చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

ముందే చెప్పి ఉంటే..

కాగా.. గత ఆదివారం రాత్రి లక్ష్మికి తీవ్రమైన విరేచనాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం వరకు అవి ఆగకపోవడంతో ఆందోళన చెందిన వరహాలు ఆస్పత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదు. ఉదయం 8 గంటల తర్వాత స్పందించిన సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్నానికి ఆస్పత్రికి చేరుకున్న లక్ష్మిని మొదట 6వ అంతస్తులో, తర్వాత 3వ అంతస్తుకు మార్చారు. పరిస్థితి విషమించడంతో స్కానింగ్ చేయగా కడుపులో ఇద్దరు పిల్లలు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పిల్లలు చనిపోయినా భార్యను కాపాడమని వేడుకున్న వరహాలు బాబుకు చెప్పకుండానే అదే రోజు రాత్రి లక్ష్మిని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం లక్ష్మి తుది శ్వాస విడిచింది. భార్యను, కడుపులోని ఇద్దరు పిల్లలను కోల్పోయిన వరహాలు బాబు కన్నీరుమున్నీరుగా విలపించాడు. పిల్లల కోసం వస్తే.. పిల్లలతో పాటు భార్యా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. నా ఆవేదనను చూసి కుటుంబ సభ్యులు ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీస్తే.. ముగ్గురి ప్రాణాలకు కలిపి రూ.4 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించాడు. ప్రతి నెలా పరీక్షలు చేస్తూ లక్షలు వసూలు చేసిన యాజమాన్యం.. చివరికి తల్లి శరీరం సహకరించడం లేదని చెప్పడం దారుణమని వరహాలు బాబు తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ముందే చెప్పి ఉంటే ఈ ప్రయత్నమే చేసేవాళ్లం కాదని రోదించింది.

కొత్త అమావాస్య జాతరకు వేళాయే..

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శోభారాణి, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గవరపాలెం పురవీధుల గుండా అమ్మవారి ఘటాల ఊరేగింపు జరుగుతుందని, శనివారం కొత్త అమావాస్య వేడుకలు, ఆదివారం ఉగాది నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది నుంచి అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంతో అమ్మవారికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పట్టువస్త్రాలు తీసుకు వస్తారన్నారు.


గవరపాలెం నూకాంబిక అమ్మవారు

ఏటీఎం కార్డుల చోరీ నిందితుడు అరెస్టు

నర్సీపట్నం : ఏటీఎం కార్డుల చోరీ నిందితుడుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న నర్సీపట్నం మున్సిపాలిటీ కృష్ణాబజార్ ఏటీఎం వద్ద షేక్ రుక్సానా డబ్బులు డ్రా చేస్తుండగా, ఆమెను మాటల్లో దించి తన ఒరిజినల్ ఏటీఎం కార్డు కాజేసి, ఆమెకు నకిలీ కార్డు ఇచ్చాడు. ఆమె ఖాతా నుంచి రూ.30 వేలు నగదు డ్రా చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఏటీఎం కార్డుల చోరీ నిందితుడిని పట్టుకునేందుకు సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి.ఎస్. రామకృష్ణ, గొలుగొండ హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు, కానిస్టేబుల్ నానితో ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం ఐదు రోజులు శ్రమించి నిందితుడు రాజమండ్రి వద్ద ధవళేశ్వరానికి చెందిన ఇల్ల వెంకటసాయి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగిందన్నారు. అతడి వద్ద నుంచి 30 ఏటీఎం కార్డులు, రూ.28 వేలు నగదు రికవరీ చేశామన్నారు. నిందితుడిపై రాజానగరం పోలీసుస్టేషన్‌లో హత్య కేసు 2016లో నమోదైందన్నారు. 2019 నుంచి నిందితుడిపై రాష్ట్రంలోని ఇబ్రహీంపట్నం, కృష్ణా, వెస్ట్ గోదావరి జిల్లాలు, ఈస్ట్ గోదావరి, అనకాపల్లి, హైదరాబాద్ ప్రాంతాల్లో 14 వరకు చోరీ కేసులు ఉన్నాయన్నారు. నిందితుడు జల్సాలకు అలవాటు పడి ఏటీఎం కార్డుల దొంగతనాలకు పాల్పడుతున్నాడన్నారు. నిందితుడుని పట్టుకున్న బృందాన్ని అభినందించారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, టౌన్ సీఐ గోవిందరావు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.


ఏటీఎం కార్డుల చోరీల నిందితుడు సాయి కిరణ్, రికవరీ చేసిన నగదు, ఏటీఎం కార్డులతో డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ చైతన్య

మునగపాకలో అగ్ని ప్రమాదం

- పాడిపెయ్యి మృతి, మరో మూడు ఆవులకు తీవ్ర గాయాలు

మునగపాక : మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో గురువారం తెల్లవారి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పాడి పెయ్యి మృతి చెందగా మూడు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. ప్రమాదానికి కల కారణం తెలియరాలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. మునగపాకకు చెందిన కర్రి నాగేశ్వరరావు,శరగడం లక్ష్మి, ఆడారి రామసూరి అప్పలనాయుడు,ఆడారి శ్రీరామమూర్తి, దొడ్డి పరదేశి నాయుడు, దొడ్డి నాగప్పారావు పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం 3.30 గంటల సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకకు నిప్పంటించడంతో ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న బాధిత రైతులు సంఘటన స్థలానికి చేరుకొని రోదించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ తదితరులు బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి కల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సంఘటన స్థలానికి తహసీల్దార్ ఆదిమహేశ్వరరావుతో కలిసి వెళ్లి పరిశీలించారు. బాధితులకు గోకులం షెడ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కాగా తీవ్రగాయాల పాలైన పశువులకు స్థానిక పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఎస్ఐ పి.ప్రసాదరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుతెన్నులను పరిశీలించారు.


గాయాల పాలైన ఆవు

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

తుమ్మపాల : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని సరికొత్త వస్త్రాలపై 30 శాతం, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయ కేంద్రాల్లో (అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం)లలో ఆప్కో విక్రయ కేంద్రాల్లో డిస్కౌంట్ ఆఫర్లు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలందరూ ఆప్కో విక్రయ శాలలు సందర్శించి తమకు కావలసిన రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ షార్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించాలని తద్వారా చేనేత కార్మికులను ఆదరించాలని ఆయన కోరారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కూరగాయల మార్కెట్లో సినిమా షూటింగ్ సందడి

అనకాపల్లి : స్థానిక గాంధీ కూరగాయల మార్కెట్లో గురువారం 24 డేస్ అనే సినిమా షూటింగ్ జరిగింది. మార్కెట్ సందడిగా మారింది. సిరి మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎన్ని శ్రీనివాస్ నిర్మాణ సారధ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటుంది. రచయిత, దర్శకుడు కిరణ్ వారియర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు కిరణ్‌కు ఇది రెండవ చిత్రం గత ఏడాది మెగా స్టార్ ఫ్యాన్ అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. నవంబర్ 29న చిత్రం రిలీజై విజయవంతంగా నడిచింది. ప్రస్తుతం గాంధీ మార్కెట్లో పోరాట సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. 27 డేస్ సినిమాలో నూతన నటి నటులతో నిర్మిస్తున్న ఈ సినిమాలో ఎన్ని రోహిత్, జీవన్, సందీప్, కాశీరాం, లోవరాజు ఐదుగురు హీరోలు నటించగా హీరోయిన్ గా సోనమ్ నటిస్తున్నారు . చిత్రం ఆద్యంతం హారర్ కామెడీ నేపథ్యంలో సాగుతుందని మే 24న దర్శకుడు కిరణ్ వారియర్ విడుదల చేయడం జరుగుతుందన్నారు.


సినిమా షూటింగ్ జరుగుతున్న దృశ్యం

మలేషియాలో చిక్కుకున్న జి.నగరం వాసి

- స్వదేశానికి రప్పించాలని స్పీకర్‌కు వినతి

నర్సీపట్నం : మాకవరపాలెం మండలం, జి.నగరం గ్రామానికి చెందిన ఒమ్మి భూషణం మలేషియాలో ఉపాధి కోసం వెళ్లి చిక్కుకున్నాడని, భూషణాన్ని స్వదేశానికి రప్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు గురువారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి వేడుకున్నారు. భూషణాన్ని స్వదేశానికి రప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని స్పీకర్ వారికి హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్లో డ్వాక్రా ఉత్పత్తులు

- డీఆర్‌డీఏ పీడీ శశీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శశీదేవి

నక్కపల్లి : డ్వాక్రాసంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ చేసే అవకాశాలను అందిపుచ్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి అన్నారు. గురువారం నక్కపల్లి వెలుగు కార్యాలయంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన మహిళా సమాఖ్యలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రాసంఘాలు చీరలు, వస్త్రాలు, హస్తకళా వస్తువులు, పచ్చళ్లు, స్వీట్లు తినుబండారాలు, సౌందర్యం, అలంకరణ, గృహోపకరణాలు వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారన్నారు. వీటిని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్లాట్‌ఫారంల ద్వారా విక్రయించి ప్రజలకు చేరువ చేయడంలో మండల సమాఖ్యలు కీలక పాత్రపోషించాలన్నారు. జిల్లాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈనెల 8న రూ.15.46 లక్షల విలువైన 10441 వస్తువులు విక్రయించేలా లక్ష్యం నిర్ణయించారన్నారు. వెలుగు ఏపీవో శ్రీనివాస్, సెంచురియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిల్, డీపీఎం వరప్రసాద్, సత్యవేణి పాల్గొన్నారు.

కశింకోటలో చోరీ

- 2.5 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.40 వేలు అపహరణ

కశింకోట : కశింకోటలోని సాయినగర్ కాలనీలో జరిగిన దొంగతనంలో సుమారు రూ.2.5 లక్షల బంగారు, వెండి నగలు, నగదు అపహరణకు గురయ్యాయి. సీఐ అల్లు స్వామినాయుడు గురువారం అందించిన వివరాల ప్రకారం..సాయి నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు బండారు జయలక్ష్మి ఇంట్లో ప్రవేశించి 2.5 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.40 వేలు నగదు అపహరించారన్నారు. ఈ నెల 16న వారు ఊరు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ దొంగతనం జరిగింది. బుధవారం వచ్చి చూడగా దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ కె. లక్ష్మణరావు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



సీనియర్ నాయకుడు రమణను పరామర్శిస్తున్న పార్టీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు

అనకాపల్లి: కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సాలాపు రమణను పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పరామర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి గురువారం రమణ స్వగృహానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరుపున తమ వంతు సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కూండ్రపు సత్తిబాబు, కోన ఉమ, సకురు చంద్రం, బాషా, సతీష్ రెడ్డి, డొంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకున్న మోహన్‌రావు, మురళీ కుటుంబ సభ్యులు

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో సాయిబాబా మందిర 23వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బాబాకు తెల్లవారుము నుంచి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేశారు. స్వామివారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మందిర వ్యవస్థాపకుడు కరణం మోహన్‌రావు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ రైతులు మోసాలకు గురికావొద్దు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం, గైతుల పాలెం గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ భూ సేకరణకు సంబంధించి రైతులు ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు కోరారు. పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ కోసం రాజమహేంద్రవరం ఎడమ కాలువ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) ఆధ్వర్యంలో భూసేకరణ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను సమర్పించడానికి ఫోన్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు రైతులను కోరుతున్నారన్నారు. ఓటీపీ, మరే ఇతర వ్యక్తిగత వివరాలుగాని రాజమహేంద్రవరం కార్యాలయం కోరడం లేదన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: పురుషోత్తపురానికి చెందిన సారిపల్లి సన్యాసమ్మ(65) అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం పొలానికి వెళుతున్నట్లు చెప్పి ఎంతకీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో మనమడు పైడిరాజు ఫిర్యాదు చేశాడు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 4,255 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,710	4,260
మొదటి రకం	3,690	4.400
రెండో రకం	3,120	3,800
మూడో రకం	2,850	3,100

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్2: ఎంపురాన్ (లూజిఫర్-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఫోకస్

పశువుల సంరక్షణ

- పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలు
- చల్లని ప్రదేశంలో ఉంచాలి
- వడదెబ్బకు గురికాకుండా చూడాలి
- పాల దిగుబడి తగ్గకుండా పచ్చిరొట్ట మేత



వేసవిలో పాల ఉత్పత్తి తగ్గకుండా దృష్టి సారించాలి...

- ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని పశువులపై పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి.
- ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే మేతకు పశువులను వదలాలి.
- పాలిచ్చే పశువులకు రోజూ తెల్లవారుజామున 6 గంటలోపు, సాయంత్రం 6 గంటల తర్వాత పాలు తీయడం వాటికి మంచి జరుగుతుంది.
- వేసవిలో ఎక్కువగా పచ్చిరొట్ట వేయాలి. రాత్రి సమయంలో ఎండిగడ్డి వేయాలి.
- వేసవిలో పశువులు రోజుకు 60 నుంచి 70 లీటర్లు నీరు తాగుతాయి. ఎక్కువగా పరిశుభ్రమైన నీటిని అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరుగుతుంది.
- పశువులను చెట్టు కింద, రేకుల షెడ్లలో ఉంచే పశువులకు చుట్టు చల్లటిగాలి తగిలే విధంగా ఉంచాలి.
- **ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని రోజుకు రెండు సార్లు పశువులను శుభ్రం చేయాలి.**



తుమ్మపాలలో గేదెకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: గ్రామాల్లో పాడిరైతులకు వెన్నుదన్నుగా ఉండే పాడిపశువులు వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల అనారోగ్యానికి గురవుతుంటాయి. సహజంగా 18–35 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు దాటితే వడదెబ్బ కారణంగా ఇవి మృతి చెందే అవకాశముంది. ఈ కాలంలో పశువులకు కావాల్సినంత మేత దొరకదు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దీని వల్ల పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటాయి. వేసవిలో వీటి సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పట్టణ, మండలంలో ఆవులు, గేదెలు 23,476 ఉన్నాయి. ఇవికాకుండా గొర్రెలు, మేకలు, ఇతర పశువులు ఉన్నాయి. ప్రధానంగా పోషకాహార లోపం కారణంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గి గొంతువాపు, గాలికుంటు, జబ్బువాపు వ్యాధులు సోకే అవకాశముంది. దీంతో పాటు కలుషితమైన నీరు తాగడం, పశువులను కడగడం వల్ల అంతర బాహ్య పరాన్నజీవుల సమస్యలు అధికమవుతాయి. ఈ వ్యాధులు రాకుండా పాడి రైతులు వేసవి ప్రారంభంలోనే ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. అంతర, బాహ్య పరాన్న జీవుల నివారణకు నట్టల నివారణ మందులు వేయించాలి.

ప్రత్యుత్పత్తి సమస్య

అధిక ఉష్ణోగ్రత కారణంగా పశువులు ఎదకు రాకుండా పోతాయి. హార్మోన్ల ఉత్పత్తి తగ్గడం వల్ల పశువులలో అండాలు సరిగ్గా ఉత్పత్తి కావు. శరీరంలో గ్లూకోజ్ పరిమాణం తగ్గటం వల్ల అండాశయాల్లో స్తబ్దత, అండోత్పత్తి వ్యత్యాసాలు సంభవించి పశువులు తిరిగి పొర్లుతుంటాయి. పశువులు ఎండుగడ్డి ఎక్కువగా తినడం వల్ల విటమిన్ -ఎ, కాపర్, మెగ్నీషియం, ఖనిజ లవణాల లోపం ఏర్పడి తాత్కాలిక వంధత్వం కలుగుతుంది.

1902కు ఫోన్ చేయవచ్చు...

పశువులు, జీవాలు వ్యాధుల బారినపడితే అత్యవసర చికిత్స కోసం 1902కు ఫోన్ చేయవచ్చు. పశువైద్యశాల సిబ్బంది వచ్చి వెంటనే వైద్యం అందిస్తారు. అవసరమైతే వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తారు.

జీర్ణక్రియ సమస్యలు వస్తాయి



పశువులకు కావాల్సినంత నీరు లభించకపోవడం, వేడి కారణంగా పరిశుభ్రమైన నీరు తాగకపోవడం వల్ల తక్కువ ఆహారం తీసుకోవడం, జీర్ణక్రియ సమస్యలైన మలబద్ధకం, పొరుడు రోగాలు వస్తాయి. ఆహార విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పగటిపూట పచ్చగడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి, రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి. పగటి పూట ఎండుగడ్డి మేపితే పశువులు ఎక్కువగా నీరు తీసుకుని మేత తక్కువగా తింటాయి. ఉష్ణోగ్రతలు కారణంగా పాలదిగుబడి తగ్గకుండా రైతులు పశువులకు ఎక్కువగా పచ్చిరొట్ట వేయాలి. చల్లని ప్రదేశంలో ఉంచాలి.

– సీహెచ్.అనిల్‌కుమార్, మండల పశువైద్యశాఖ అధికారి, అనకాపల్లి

వడదెబ్బకు గురికాకుండా..

వేసవిలో పశువులను మేత కోసం పొలాలు, అడవుల్లోకి తీసుకెళ్తారు. ఇలా చేయడం వల్ల పశువులు అధిక వేడిని తట్టుకోలేక వడదెబ్బకు గురవుతాయి. పశువులు ఎక్కువ సమయం ఎండలో ఉండటం, తాగునీరు పూర్తిస్థాయిలో లభించకపోవడం వల్ల వడదెబ్బకు గురవుతాయి. పశువు శరీర ఉష్ణోగ్రత శ్వాస, నాడి వేగం బాగా పెరుగుతుంది. చెమట ఎక్కువగా పడుతుంది. కొన్ని సందర్భాల్లో అపస్మారక స్థితికి చేరుకుని చనిపోయే ప్రమాదముంది. పశువుల్లో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి గానీ, షెడ్‌లోకి గానీ తీసుకెళ్లాలి. పశువుకు చల్లటి, శుభ్రమైన నీటిని కడగాలి. పశువు తాగినంత నీరు ఇవ్వాలి. ప్రథమ చికిత్స కూడా అందించాలి. ప్రధానంగా 6 నుంచి 11 గంటల, సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య కాలంలో పశువులను మేత కోసం బయటకు తీసుకెళ్లాలి. మిగిలిన సమయంలో పాకలో కట్టేసి మేపడం చాలా మంచిది.

వెలవెలబోయిన జాతీయ రహదారి కూడలి



తాళ్లపాలెం వద్ద వెలవెలబోయిన జాతీయ రహదారి కూడలి

కశింకోట: మండల ప్రజలు గురువారం సూర్య తాపంతో గురువారం విలవిలలాడారు. జాతీయ రహదారి సైతం వెలవెలబోయింది. కశింకోటలోని వారపు సంత బోసిపోయింది. వేసవి ప్రారంభం కావడంతో రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతోంది. కొంత కాలంగా దాదాపు 36 డిగ్రీల సెల్సియస్ వరకు ఉన్న ఉష్ణోగ్రత గురువారం 37 డిగ్రీలకు పెరిగింది. ఇది రానున్న రోజుల్లో పెరగనుందని సమాచారం. ఎండ తీవ్రతతో ప్రజలు ఉదయం 11 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రావడానికి అత్యవసరం అయితే తప్ప సాహసించలేదు. దీంతో రోడ్లు దాదాపు నిర్మానుష్యంగా మారాయి. కశింకోట, తాళ్లపాలెం కూడళ్లలో వాహన సంచారం తగ్గిపోయి, జన సంచారం లేక వెలవెలబోయాయి. కశింకోట వారపు సంతలో చిరు వ్యాపారులు దుకాణాలను విడిచి నీడ పట్టుకు చేరుకున్నారు. ఎండ తీవ్రత ఉన్నంత వరకు కొనుగోలుదారులు కరవు అయ్యారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎండ తీవ్రత తగ్గడంతో క్రమేపి కొనుగోళ్లు పుంజుకొని ముమ్మరంగా రాత్రి వరకు సాగాయి.

రేపు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గాయత్రి స్కూలులో ఈ నెల 29న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు స్కూలు కరస్పాండెంట్ బి. రామ్‌కుమార్ తెలిపారు. స్కూలుతోపాటు విశాఖ కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే శిబిరంలో ఉచిత సుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుందని ఎంపీడీవో జయప్రకాష్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన ర్యాలీ



ప్లాస్టిక్ అనర్థాలపై బొమ్మల ద్వారా విద్యార్థుల ప్రచారం



ఇళ్లకు వెళ్లి గుడ్డ సంచులు అందజేస్తున్న బాలిక

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలు విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బొమ్మలు వేసి వాటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఏవీఏ ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం, జీవ వైవిధ్య నష్టం జరుగుతాయన్నారు. మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. వాతావరణ మార్పులకు గురవుతుందన్నారు. స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బోయిన చిన్నారావు, సబిత లక్ష్మి, పీవీఎస్ఎన్ మూర్తి, నూకరాజు, సత్యవాణి, త్రివేణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

ఎస్పీ తుహిన్ సిన్హా



మోహన్‌రావును శాలువాతో సత్కరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లాలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ విశేష సేవలందించిన డీఆర్ మోహన్‌రావుకు ఎస్ఐగా పదోన్నతిని కల్పిస్తూ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో మోహన్‌రావును ఎస్పీ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లాలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా విధుల నిర్వహిస్తూ పదోన్నతి పొందడం అభినందనీయమన్నారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, కంట్రోల్ రూమ్ సీఐ రమేష్, ఎస్ఐ డి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య ఉత్సవాలు ప్రారంభం



కశింకోటలో నూకాంబిక అమ్మవారికి పూజలు



విద్యుద్దీపాలంకరణతో అమ్మవారి ముఖ ద్వారం



సారెతో దర్శనానికి తరలివచ్చిన జాలారి కుటుంబాలు



దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ శివారులో 1948లో స్వయం భూగా వెలసినప్పటి నుంచి అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మొదటగా సంప్రదాయంగా జాలార్లు తమ కుటుంబ సభ్యులతోపాటు పిండి వంటలు, అరటి గెలలు, చీరలు, రవికెలు వగైరా పళ్లాల్లో ఊరేగింపుగా డప్పులు, వాయిద్యాలతో, పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ సారె తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు అమ్మవారికి నివేదించి ప్రసాద వితరణ చేశారు. ఉత్సవాల్లో భాగంగా జాగరణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి జీవిత చరిత్రను గానం చేశారు.

నేడు, రేపు కొత్త అమావాస్య:

శుక్ర, శనివారం కొత్త అమావాస్య ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శివగణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి జాతర ఊరేగింపు గ్రామంలో జరుగుతుందని, రాత్రి 11 గంటలకు ఆలయం వద్ద అగ్ని గుండాలు (కొండాలు) తొక్కనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో వెలమ, దేవాంగుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో సారె ఊరేగింపులు జరగనున్నట్లు తెలిపారు. ఈ నెల 31న ఉగాది పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో దేదీప్యమానంగా అలంకరించారు.

నూకాంబిక అమ్మవారు గరగల ఊరేగింపు



అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



ఘటాల ఊరేగింపులో పులివేషాలు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధిలో చిన్న నూకాలమ్మ గరగలను, ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పుర వీధుల్లో గురువారం ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో పులివేషాలు, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తాకాశి కిశోర్ మాట్లాడుతూ 2016 సంవత్సరాల చరిత్ర కలిగిన పుట్టలో స్వయంభూగా అమ్మవారు వెలసినట్లు తెలిపారు. శుక్రవారం రాత్రికి కొత్త అమావాస్య జాతర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, తాకాశివీధి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని ధర్నా



ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు ఫ్లైఓవర్ ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని గోతులు లేని రహదారులుగా అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. గురువారం కొత్తూరు పంచాయతీ ఏఎంఏఎల్ కళాశాల ఫ్లైఓవర్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇక్కడ రోడ్లకు శంకుస్థాపన చేసిన మూడు నాలుగు నెలలు కావస్తున్నా పనులు ప్రారంభం కాలేదని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపనలు మాత్రమే చేశారని, పనులు ఎక్కడా చేయలేదని ధ్వజమెత్తారు. ఫ్లైఓవర్‌పై కనీసం రక్షణ గోడలు నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తొమ్మిది మాసాలుగా కొత్తూరు ఫ్లైఓవర్ మరమ్మతులు చేపట్టకపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి అనకాపల్లి పట్టణానికి వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వియ్యపు రాజు, కె. వీరాచారి, కె. త్రినాథ్, విత్తనాల పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, ఆడారి రామారావు, యు. గణేష్, శ్రీను, బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

కశింకోట: మండలంలోని తేగాడ కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి వచ్చే నెల 11లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశానికి, 8, 9, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, బీపీఎల్ బాలికలు ప్రవేశానికి అర్హులన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే ప్రవేశానికి పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులను ౖ ఇజుజ ఖి.ౖ ఇభిజటట.జీ ౩ వెబ్ చిరునామాకు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు ఎన్టీపీసీ కృషి

పరవాడ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం కృషి చేస్తుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ అన్నారు. సింహాద్రి హెచ్‌వోపీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన స్టేక్ హోల్డర్స్ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్యా, నైపుణ్యాభివృద్ధి పెంపొందించేలా సంస్థ చర్యలు తీసుకుంటోందన్నారు. సంస్థ ద్వారా పరవాడ మండలంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. సమావేశంలో సంస్థ ఏజీఎం హెచ్‌ఆర్ బి.బి.పాత్ర, మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని నిరసన



సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ ఎదుట నిరసనలో కార్మికులు

పరవాడ: ఫార్మాసిటీలోని సాయినాథ్ లైఫ్ సైన్స్ పరిశ్రమ యాజమాన్యం కార్మికుల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమ ఎదుట సిటు ఆధ్వర్యంలో గురువారం కార్మికులు నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదం లేకుండా, పారిశ్రామిక చట్టాలను ఉల్లంఘించి పరిశ్రమను మూసివేసి కార్మికుల బకాయి వేతనాలను చెల్లించకుండా మొండి వైఖరి అవలంబించడం సరికాదన్నారు. కార్మికులకు చట్టపరంగా రావాల్సిన వేతనాలు, గ్రాట్యుటీ, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ లేబర్ కమిషనర్ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలన్నారు. అంతకు ముందు కార్మికుల బకాయి వేతనాలు చెల్లించేలా పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మహేష్, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.